సాక్షి వికారాబాద్

బుధవారం । 20 । ఆగస్టు । 2025



మీ సేవలో దోపిడీ!

ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. 8లో▸



ఆపదొస్తే.. అరిగోసే!

నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలంలో ప్రజారోగ్యానికి భరోసా లేకుండా పోయింది. 9లో▸



సమస్యలు పరిష్కరించాలి

ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. 9లో▸



వానలే వానలు

అలుగు పారుతున్న శివసాగర్ ప్రాజెక్టు

వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షం

- జాలువారుతున్న పంటపొలాలు
- వేలాది ఎకరాల్లో నష్టం
- కుంగిపోతున్న కల్వర్టులు
- నామమాత్రపు మరమ్మతులతో సరిపెడుతున్న అధికారులు

వికారాబాద్: జిల్లాలో వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జాలువారి పంటలు పాడవుతున్నాయి. ఈ నెల 12న ప్రారంభమైన వర్షాలు మంగళవారం వరకు కురుస్తూనే ఉన్నాయి. సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. వరినాట్లు వేస్తున్న రైతులకు ఈ వానలు ఎంతో ఉపయోగకరం కాగా మిగతా పంటలు వేసిన వారికి శాపంగా మారాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతోంది. వాగులు పారుతూ చెరువుల్లోకి భారీగా నీరు చేరుతోంది. దాదాపు అన్ని చెరువులు అలుగు పారుతున్నాయి. పలు చోట్ల లో లెవెల్ వంతెనలపై నుంచి వాగులు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరికొన్ని చోట్ల సాహసం చేసి వాగులు దాటి వెళుతున్నారు. గత వారం పరిగి – వికారాబాద్ మార్గంలోని వంతెన కుంగిపోగా వాహనదారులు అవస్థలు పడ్డారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే మార్గంలో మద్గుల్ చిట్టంపల్లి సమీపంలో వాగుపై భారీ గుంత పడింది. మధ్యలో కుంగిపోవడంతో ఇరువైపులా మట్టిపోసి తాత్కాలిక ఏర్పాట్లు చేశారు.



పూడూరు: మంచన్‌పల్లి వద్ద వాగుకు జేసీబీని అడ్డుగా ఉంచిన అధికారులు

వేల ఎకరాల్లో..

ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ఐదున్నర లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 4.5 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. మరో లక్ష ఎకరాల్లో వరి సాగు చేయవచ్చని అధికారులు అంటున్నారు. చెరువులు, కుంటలు, బావులు, బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో వరి నాట్లు వేసే రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగు చేసిన వారు మాత్రం ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 50శాతం పంట పొలాలు జాలువారే పరిస్థితి వచ్చింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పది ఇళ్లు కూలిపోయాయి. వేల ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. వానలు తగ్గుముఖం పట్టి పది రోజుల పాటు ఎండ కాస్తేనే పంటలు గట్టెక్కుతాయని అన్నదాతలు అంటున్నారు. లేకుంటే పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తమైన అధికారులు

వర్షాభావ పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గత అనుభవాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశించారు. జిల్లాలోని 20 రోడ్లలో ప్రమాదకర వాగులు, బ్రిడ్జీలను గుర్తించారు. వాటి వద్ద అధికారుల పహారా కాస్తున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరి కాలనీలు చిన్నపాటి మడుగులను తలపిస్తున్నాయి. రోడ్లన్నీ జలమయంగా.. బురదమయంగా మారాయి. పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో అధిక వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి.

న్యూస్‌రీల్

డెంగీ నివారణకు చర్యలు



దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాండూరు: మున్సిపల్ పరిధిలో డెంగీ నివారణకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఇందిరానగర్, మల్‌రెడ్డిపల్లి, పాత తాండూరు ప్రాంతాల్లో దోమలు, లార్వాల నివారణకు మందు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లకు వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. పరిసరాలు, ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ మాలశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతగిరి: అపోలో హోం హెల్త్ కెర్ ప్రైవేట్ లిమిటెడ్ నందు హోం కేర్ నర్సస్ ఉద్యోగాల భర్తీ కోసం గురువారం వికారాబాద్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9676047444లో సంప్రదించాలన్నారు.

ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన నర్మద



ప్రవీణ్‌కుమార్‌కు బొకే అందజేస్తున్న నర్మద

కొడంగల్: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆ పార్టీ కొడంగల్ నాయకురాలు నర్మద మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కొడంగల్‌లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని ఆయన సూచించారని తెలిపారు.

హిందీ ఉపాధ్యాయురాలికి పీహెచ్‌డీ పట్టా



పీహెచ్‌డీ పట్టాతో నర్సమ్మ

దుద్యాల్: మండలంలోని పోలేపల్లికి చెందిన నర్సమ్మ హిందీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన 84వ స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని చెట్టుపల్లి తండా కేజీబీవీలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ దళిత సాహిత్యంపై హిందీలో పరిశోధనలు చేసినట్లు తెలిపారు. తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

సాదియా బేగంకు బంగారు పతకం



గవర్నర్ చేతుల మీదుగా పతకం అందుకుంటున్న సాదియాబేగం

పరిగి: పరిగి పట్టణానికి చెందిన నజీరుద్దీన్ కూతురు సాదియా బేగం బంగారు పతకం అందుకుంది. ఉస్మానియ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఇంగ్లిష్ 2023 – 24లో టాపర్‌గా నిలవడంతో బంగారు పతకం అందజేశారు. మంగళవారం నగరంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శత రుద్రాభిషేకం



శత రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ మల్లికార్జున భవనంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మంగళవారం లోక కల్యాణార్థం తెలంగాణ అర్చక జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 108 మంది అర్చకుల సమక్షంలో మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. డాక్టర్ ముద్ద భక్తవత్సలం దంపతులు ఈ కార్యక్రమం జరిపించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఇతర నాయకులు పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ వేదపండితులు సాంబశివశర్మ, డాక్టర్ మహంతయ్య, నాగయ్య స్వామి, ప్రహ్లాద్ సంగయ్య , ఆలయ ప్రధాన అర్చకులు బస్వరాజుతో పాటు ఆయా ఆలయాల జంగమ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

- ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మర్పల్లి: మర్పల్లి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చైర్మన్ వై మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ముందుగా మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి ఆదాయ వ్యయాలు చదివి వినిపించారు. అనంతరం అభివృద్ధిపై సభ్యులు చర్చించారు. మోమిన్‌పేట్, బంట్వారం మండలాల్లో నిర్వహిస్తున్న మేకల సంతకు భూమి కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మోమిన్‌పేట్‌లో నందివాగు ప్రాజెక్టు పక్కన రెండు ఎకరాల భూమి, బంట్వారం బస్టాండ్ పక్కన ఎకరా భూమి కేటాయించాలని కలెక్టర్‌కు లేఖలు రాసినట్లు చెప్పారు. ఈ విషయమై స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో మాట్లాడి వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ప్రభుత్వం భూమి కేటాయించగానే మోమిన్‌పేట్, బంట్వారంలో రూ.కోటి చొప్పున రెండు షెడ్లు నిర్మిస్తామని తెలిపారు. అలాగే సాగుకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఏఓ శ్రీకాంత్, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.



నందివాగు కల్వర్టును పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

ప్రమాదకర వాగులు దాటొద్దు

- ఎస్పీ నారాయణరెడ్డి

మోమిన్‌పేట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు మార్గాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని వాటిని దాటే ప్రయత్నం చేయరాదని ఎస్పీ నారాయణరెడ్డి ప్రజలకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వాగు దాటాల్సి వస్తే ఒకటికి రెండు సార్లు ఆలోచించి ప్రమాదం జరగదని తేలిన తర్వాతే దాటే ప్ర యత్నం చేయాలన్నారు. మంగళవారం మండలంలోని నందివాగు ప్రాజెక్టు అలుగు, కల్వర్టును పరిశీలించారు. ఇలాంటి వాటిని దాటరాదన్నారు. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాలు తగ్గు ముఖం పట్టేవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీలైనంత వరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. అత్యవసరం అయితే సుర క్షిత మార్గాల్లో మాత్రమే వెళ్లాలని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు లేదా డయల్ 100కు కాలే చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకట్, ఎస్ఐ అరవింద్ తదితరులు ఉన్నారు.

పొలంలో నీరు ఉండొద్దు

- జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం
- ధారూరులో నీట మునిగిన పత్తి చేను పరిశీలన

ధారూరు: మండల కేంద్రంలో నీట మునిగిన పత్తి పంటను జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం పరిశీలించారు. మంగళవారం ధారూరు రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అధిక వర్షాలు కరుస్తునందున పంట పొలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. కాల్వలు తీసి నీటిని బయటకు పంపాలని సూచించారు. వేరుకుళ్లు తెగు లురాకుండా కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్ల వద్ద పోయాలన్నారు. ప్రస్తుతం కంది పంట కొమ్మలు ఏర్పడే దశలో ఉందని, వేరుకుళ్లు తెగులు నివారణకు 2 గ్రాముల మెటలాగ్జిన్‌ను లీటరు నీటిలో కలిపి మొదళ్లు తడిసేలా పోయాలన్నారు. నానో యూరియా వాడాలని రైతులకు సూచించారు.



ధారూరులో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ రాజరత్నం తదితరులు

ఘన స్వాగతం



రాంచందర్‌రావును సన్మానించిన బీజేపీ నాయకులు

పూడూరు: వికారాబాద్ పర్యటనకు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును మండల నాయకులు ఘనంగా సన్మానించారు. అంగడిచిట్టంపల్లి గేటు వద్ద, మన్నెగూడ చౌరస్తాల్లో శాలువా, గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్, నాయకులు వెంకటయ్య, రవీందర్, అనీల్, నవీన్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన

యాచారం: మండలంలోని చౌదర్‌పల్లిలో మంగళవారం కూరగాయల పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ఏ సీజన్‌లో ఏవి సాగు చేయాలి, మార్కెట్‌కు తరలింపు, విత్తనాలు, నార్ల ఎంపికలపై అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి బసవన్నప్ప వివరించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ



బహుమతులు అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు

- బాలుర విభాగంలో విజేత భద్రాద్రి కొత్తగూడెం జట్టు
- బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టుకు ప్రథమ స్థానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–15 బాలుర, బాలికల వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. బాలుర విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం ప్రథమ స్థానంలో, రంగారెడ్డి ద్వితీయ స్థానంలో, మంచిర్యాల తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానం నిజామాబాద్, ద్వితీయ స్థానం సూర్యాపేట, తృతీయ స్థానం నారాయణ్‌పేట జిల్లాలు దక్కించుకున్నాయి. విజేతలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హీర్యానాయక్, గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘువరెడ్డి, పీఈటీలు, పీడీలు నాగరాజు, సుధాకర్, షబ్బీర్, చెన్నకిష్టారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, రవికుమార్, బస్వరాజ్, మల్లేష్, బాబయ్య, వెంకటేశ్, శ్రీలత, జోనల్ సెక్రటరీ పీడీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ముగింపు

రాష్ట్ర స్థాయిలో 32 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్న టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎవరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. సాదాసీదా కార్యక్రమం ముగించడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు.

భారీ వర్షాలకు కూలిన ఇళ్లు



పరిగిలో వర్షానికి కూలిన ఇల్లు



తాండూరు టౌన్: మల్‌రెడ్డిపల్లిలో కూలిన ఇంటి పైకప్పు



మర్పల్లి: గుర్రంగట్టు తండాలో ఇల్లు కూలడంతో ఆదుకోవాలని కోరుతున్న బాధితులు

- తాండూరు, మర్పల్లి, దోమ, పరిగి మండలాల్లో ఘటనలు
- ఆదుకోవాలని బాధితుల విన్నపం

పరిగి/తాండూరు టౌన్/మర్పల్లి/దోమ: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు మండలాల్లో మంగళవారం ఇళ్లు కూలిపోయాయి. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. మర్పల్లి మండలం బూచన్‌పల్లి, గుర్రం గట్టుతండా, కొత్లాపూర్ గ్రామాల్లో మూడు ఇళ్లు పడిపోయాయి. తమను ఆదుకోవాలని బాధితులు నూతి లలితమ్మ, మెగావత్ సీతీబాయి, బేగరి పద్మమ్మ ప్రభుత్వాన్ని కోరారు. దోమ మండలం ఐనాపూర్‌లో నర్సమ్మకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఇంట్లోని సామగ్రి పూర్తిగా దెబ్బతింది. పరిగి పట్టణ పరిధిలోని బోయవాడ కాలనీకి చెందిన కుమ్మరి నర్సింహులు ఇల్లు పడిపోయింది. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు. తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లిలోని ఓ ఇల్లు కూలిపోయింది. మిట్టి చంద్రమ్మ భర్త మృతి చెందడంతో ఇద్దరు కుమారులతో నాపరాతి కప్పు గల ఇంటిలో జీవనం సాగిస్తోంది. ఇద్దరు కుమారులు పనుల కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. మంగళవారం ఇంటి పైకప్పు ఓ పక్క కూలిపోయింది. ఆ సమయంలో చంద్రమ్మ ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తనకు ఇళ్లు తప్ప ఏ దిక్కూ లేదని, ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ఆర్థిక సాయం అందించాలని వేడుకుంది.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో మూగజీవాల మృత్యువాత

బంట్వారం: విద్యుత్ షాక్‌తో మేకలు మృతిచెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున కోట్‌పల్లి మండలం బార్వాద్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పెంటయ్య ఎప్పటిలాగే తన మేకలను ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో ఉంచాడు. కరెంటు తీగలు రేకులకు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి ఎనిమిది మేకలు మృతిచెందాయి. దీంతో తన రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

పాడి గేదె దుర్మరణం..

యాలాల: విద్యుదాఘాతంతో ఓ గెదే మృతి చెందింది. దేవనూరుకు చెందిన గోరేపల్లి లక్ష్మప్పకు చెందిన గెదేను పొలం శివారులోని షెడ్డులో మేతకు వదిలాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు షెడ్డులో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

మోమిన్‌పేట: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ అరవింద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం మోమిన్‌పేటకు చెందిన అరిగే ఉదయ్‌కుమార్, కుడుగుంట విజయ్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వీరిని వికారాబాద్ మారిౣంగ్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చగా.. మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.3 వేల చొప్పున జరిమానా విధించారన్నారు. ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు.

రహిమతున్నీసాకు బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రహిమతున్నీసా

అనంతగిరి: పూడూరు మండలం మీర్జాపూర్ ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న రహిమతున్నీసా బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.

600 ఎకరాల్లో పంట నష్టం



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ కొమురయ్య

తాండూరు రూరల్: వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తాండూరు వ్యవసాయశాఖ ఏడీఏ కొమురయ్య అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. తాండూరు మండలంలో 600 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈనివేదికను జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు పంపిస్తామన్నారు. పత్తి పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపించాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఈఓ, రైతులు ఉన్నారు.

చెరువు కట్టకు తాత్కాలిక మరమ్మతులు



ఇసుక బస్తాలు వేసి పూడ్చిన కట్ట

ధారూరు: మండల పరిధిలోని గురుదోడ్ల చెరువు కట్టకు ఇరిగేషన్ అధికారులు మంగళారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈనెల 14న అర్ధరాత్రి వేళతెగిపోయిన కట్ట ముందు భాగంలో ఇసుక బస్తాలు వేసి మట్టితో పూడ్చారు. బుధవారం పనులను పూర్తి చేస్తామని చెప్పడంతో రైతులు సంతోషం వ్యక్తంచేశారు. చెరువు నుంచి పారిన వరదతో 35 ఎకరాల మేర పంట పాడైందని తెలిపారు. రూ.2.50 లక్షలు వెచ్చించి రాజమండ్రి నుంచి చేప పిల్లలు తీసుకువచ్చి వదిలామని, కట్ట తెగిపోవడంతో తాము నష్టపోయామని పీసీఎం తండా, జీడిగడ్డతండా గిరిజనులు వాపోయారు. తమకు పరిహారం చెల్లించాలని బాధితులు కోరారు.

ఇద్దరికి జైలు

మోమిన్‌పేట: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ అరవింద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం మోమిన్‌పేటకు చెందిన అరిగే ఉదయ్‌కుమార్, కుడుగుంట విజయ్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వీరిని వికారాబాద్ మార్నింగ్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చగా.. మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.3 వేల చొప్పున జరిమానా విధించారన్నారు.

ఉప్పొంగుతున్న వాగులు

వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలకు జిల్లాలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆయా మార్గాల్లోని వాగులు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు స్తంభించి పోయాయి.. పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోగా.. పంటలు నీట మునిగాయి.. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండు కుండాలా మారాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి చర్యలు చేపడుతున్నారు. – అనంతగిరి



తాండూరు రూరల్: సిరిగిరిపేట్‌లో పత్తి పొలంలో వర్షపు నీరు



తాండూరు రూరల్: బెల్కటూర్ వద్ద మళ్లీ కోతకు గురైన డైవర్షన్ రోడ్డు



ధారూరు: నిండిన ఎబ్బనూర్ చెరువు



పూడూరు: కడుమూరు వద్ద ఈసీ వాగు ప్రవాహం



ధారూరు: రుద్రారం - నాగసమందర్ మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



అనంతగిరి: పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు




అనంతగిరి: అలుగు పారుతున్న సర్పన్‌పల్లి ప్రాజెక్టు



దోమ: ప్రమాదపుటంచున బాస్‌పల్లి కొత్త చెరువు అలుగు



అనంతగిరి: సర్పన్‌పల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ రవి తదితరులు



బొంరాస్‌పేట: వడిచర్ల వద్ద పారుతున్న చెరువు అలుగు



పొంగి పొర్లుతున్న పరిగి నస్కల్ వాగు



మోమిన్‌పేట: పెద్దవాగు, దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్



బొంరాస్‌పేటలో కురుస్తున్న వర్షం

మీ సేవలో దోపిడీ!



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

- ఒక్కో రేషన్ కార్డుకు రూ.1,500 చొప్పున వసూలు
- నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల సేకరణ
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

పూడూరు: ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాల్లో అవినీతి జలగలు పీక్కు తింటున్నాయి. కానీ సంబంధిత అధికారులు వీరిపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మన్నెగూడకు చెందిన సనాబేగం, జాకీర్ హుస్సేన్ రేషన్‌కార్డుల దరఖాస్తు చేసుకునేందుకు పూడూరులోని మీ సేవ కేంద్రానికి వెళ్లారు. వీరి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.1500 చొప్పున వసూలు చేసిన నిర్వాహకులు మొత్తం రూ.3 వేలు తీసుకున్నారు. రేషన్ కార్డు ఇప్పించే బాధ్యత మాదేనని చెప్పారు. మండల పరిధిలోని అన్ని మీ సేవల పరిస్థితి ఇలాగే తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా దరఖాస్తులకు ప్రభుత్వం నిర్ధారించిన ఫీజులకు విరుద్ధంగా వసూలు చేస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బంది వీరితో కుమ్మక్కై దండుకుంటున్నారు. అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి మరీ వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో తరచూ ఎక్కడో ఓ చోట ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా అక్రమాలు ఆగడం లేదు. అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుతో ఇటీవల ధారూరులోని మీ సేవ కేంద్రాన్ని అధికారులు సీజ్ చేశారు. కానీ ప్రభుత్వ పథకాలు కావాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని నిర్వాహకులు బెదిరిస్తున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మొదలుకుని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వరకు అన్ని దరఖాస్తులు మేమే చూసుకుంటాం అంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు.

ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందిస్తోంది. కొన్ని చోట్ల మీ సేవ నిర్వాహకులు మాత్రం అధిక మొత్తం డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే దరఖాస్తులు పక్కన పెడుతున్నారు. అమాయక ప్రజలను దోచుకుంటూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న మీ సేవ కేంద్రాల నిర్వాహకులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. ఆయా పనుల కోసం వెళ్లే వారు నిర్దేశిత ఫీజులు మాత్రమే చెల్లించాలి.

– అజీం పటేల్, డీసీసీ కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



మీ సేవ కేంద్రానికి వచ్చే ప్రజల వద్ద అధిక డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. రేషన్ కార్డులు ఇప్పిస్తామని మీ సేవ కేంద్రం నిర్వాహకుడు డబ్బులు తీసుకున్నాడని మన్నెగూడకు చెందిన వారు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– భరత్‌గౌడ్, తహసీల్దార్ పూడూరు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



తాండూరులో అన్నదానం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

తాండూరు టౌన్: తాండూరు ఫొటో అండ్ వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈమేరకు స్థానిక వినాయక్ చౌక్‌లో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఒక ఫొటో అనేక పాత, మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెస్తుందని తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, హీరాలాల్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజిక్స్‌లో విద్యారాణికి పీహెచ్‌డీ పట్టా



పట్టా అందుకున్న విద్యారాణి



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సంధ్యారాణి

షాద్‌నగర్‌రూరల్: ఫిజిక్స్‌లో 'వేరియబుల్ అపోడైజేషన్ రీసెర్చ్ గైడ్ ఆప్టికల్ ఇమేజింగ్ సిస్టం'పై చేసిన పరిశోధనకు గాను షాద్‌నగర్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఎస్.విద్యారాణికి ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. విద్యారాణి ప్రొఫెసర్ కరుణసాగర్ నేతృత్వంలో పరిశోధన చేసి గ్రంథాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్, వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. ప్రస్తుతం ఆమె మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాలలో ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

డాక్టరేట్ అందుకున్న సంధ్యారాణి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ డివిజన్‌లో సూపర్ వైజర్‌గా పని చేస్తున్న సంధ్యారాణి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గంగపుత్ర కమ్యూనిటీలో మహిళా సాధికారత అంశంపై అసోసియేటెడ్ ప్రొఫెసర్ ధీరజ్ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ నారాయణన్, యూనివర్సిటీ వీసీ కుమార్ మొలుగారం చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

ఐదుగురు అధ్యాపకులకు డాక్టరేట్

హయత్‌నగర్: హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న లెక్చరర్లు అవేష్ మోహియుద్దీన్, మధు, మల్ల, యాదగిరిరెడ్డి, నాగరాజు డాక్టరేట్ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, వీసీ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. భౌతిక శాస్త్రంలో పరిశోధనలు చేసినందుకు గాను అవేష్ మోహియుద్దీన్, మధుకు, రాజనీతి శాస్త్రంలో పరిశోధనలకు యాదగిరిరెడ్డి, నాగరాజులకు, ఇంగ్లిష్‌లో పరిశోధనలకు మల్లకు దక్కాయి.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

నందిగామ: బైక్ నడుపుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చేగూరులో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. షాబాద్ మండలం మద్దూరుకు చెందిన ఇటుకల కిరణ్(19) తన స్నేహితుడు నరేశ్‌తో కలిసి సోమవారం రాత్రి 11:30 గంటల సమయంలో బైక్‌పై నందిగామ మండలం చేగూరు మీదుగా కొత్తూరుకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి, రోడ్డు పక్కన పంట పొలాలకు వేసిన ప్రీకాస్ట్ ప్రహరీని ఢీకొట్టారు. ఉస్మానియాలో చికిత్స పొందుతున్న కిరణ్ మంగళశారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ప్రసాద్ తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

నందిగామ: భార్యాభర్తల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఈదులపల్లిలో సోమవారం చోటుచేసుకోగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా నానూర్ మండలం చిట్టగూడకు చెందిన ధుర్వత రాణి(21), ఇదే గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ భార్యభర్తలు. వీరు రెండేళ్ల క్రితం బతుకు దెరువు నిమిత్తం ఈదులపల్లికి వలస వచ్చి, స్థానికంగా ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తున్నారు. వీరిమధ్య గత సోమవారం డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన రాణి భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లోని వాష్‌రూంలో చున్నీతో ఉరేసుకుంది. తోటి కూలీల సాయంతో ఆమెను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి సుశీలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

సాంకేతిక సమస్యలతో తిరుపతి విమానం రద్దు

శంషాబాద్: సాంకేతిక సమస్యలతో తిరుపతి విమానం రద్దు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి మంగళవారం ఉదయం 5.55 గంటలకు 53 మంది ప్రయాణికులతో అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 91877 విమానం తిరుపతికి బయలుదేరేందుకు సిద్ధమైంది. విమానంలో టేకాఫ్ తీసుకునే ముందు సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ విమానాన్ని నిలిపివేశారు. కొన్ని గంటల తర్వాత విమానాన్ని రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు ప్రయాణికులకు వెల్లడించారు.

ప్లంబర్ మృతి

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ పరిధిలోని బీకేగూడలో మంగళవారం ఓ ప్లంబర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీకేగూడ 60 ఫీట్ రోడ్డులో ఈశ్వర్ ప్రసాద్ అనే వ్యక్తి ఇటీవల ఓ టిఫిన్ సెంటర్ ప్రారంభించాడు. అబిడ్స్ చిరాగల్లీలో ఉండే కె.విష్ణు అలియాస్ కృష్ణ (37) అనే వ్యక్తి టిఫిన్ సెంటర్‌లో ప్లంబింగ్ పనులు చేసేందుకు వచ్చాడు. ఈ మేరకు కొంత సామగ్రి గొనుగోలు చేసి మరమ్మతులు చేసేందుకు టిఫిన్ సెంటర్ పైపోర్షన్‌కు వెళ్లాడు. ఎంత సేపటికి కిందకు రాలేదు. మధ్యాహ్నం కావస్తున్నా అతడు రాకపోవడంతో పైకి వెళ్లి చూడగా కృష్ణ కింద పడిపోయి కనిపించాడు. పరీక్షించగా కొనఊపిరితో ఉన్నట్లు గుర్తించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

అమ్మ మందలించిందని..

- ఇంట్లోనుంచి వెళ్లిన బాలుడు
- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



బాలున్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పట్నం పోలీసులు

ఇబ్రహీంపట్నం: తల్లి మందలించడంతో అలిగి ఇంట్లో నుంచి వెళ్లిన బాలున్ని ఇబ్రహీంపట్నం పోలీసులు క్షేమంగా అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దేవరకొండకు చెందిన విజయకుమారి, హరిష్ దంపతులు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బ్రాహ్మణపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరి కొడుకు తుర్కయంజాల్ కాకతీయ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. చిన్న విషయంలో అమ్మ మందలించిందనే కారణంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తుర్కయంజాల్ నుంచి ఇబ్రహీంపట్నం చెరువు కట్ట వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా పోలీసుల కంటపడ్డాడు. అతన్ని ఆరా తీసి, పీఎస్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రులను పిలిచి అప్పగించారు.

రెడీ మిక్స్ ప్లాంట్ సీజ్



కుంట్లూర్‌లో రెడీమిక్స్ ప్లాంట్ సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని కుంట్లూర్ సర్వేనంబర్ 177లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన రెడీమిక్స్ ప్లాంట్‌ను మంగళవారం మున్సిపల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, పోలీసులు సీజ్ చేశారు. మున్సిపల్‌తో పాటు అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే ప్లాంటును నిర్వహించాలని లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.